సాక్షి
విజయనగరం

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



అపర సంజీవిని ఆపసోపాలు..!

టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్వాకంతో అత్యవసర వేళ సేవలందించే 108 వాహనాలు ఆపసోపాలు పడుతున్నాయి. - 8లో



పట్టు బిగిస్తున్న ఉత్తరాఖండ్

విజయనగరం జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్- ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు పట్టు బిగిస్తోంది. - 8లో



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అక్కాచెల్లెళ్లు - 8లో

డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు అట్టాడ ధనుశ్రీ, దీక్ష శ్రీలు తైక్వాండోలో రాణిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఇంజినీరింగ్ లోపాలు సరిచేస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట

- ఎస్పీ వకుల్ జిందాల్



అంబటివలస వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బొండపల్లి: మండలంలోని అంబటివలస వద్ద జాతీయ రహదారి-26పై తరచుగా రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయని, రహదారిలో ఇంజినీరింగ్ లోపాలు సవరిస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ వకుల్‌జిందాల్ అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్రనివేదిక ఇవ్వాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావుకు సూచించారు. అంబటివలస గ్రామం వద్ద గల జాతీయ రహదారిని సర్కిల్ పరిధిలోని పోలీసులతో కలిసి గురువారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు గ్రామానికి 100 మీటర్ల పరిధిలో తరచూ జరుగుతున్నట్టు గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో వేగనిరోధకాలతో పాటు, స్టాపర్లను ఏర్పాటు చేయాలన్నారు. నివేదిక అందజేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీతోపాటు గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ, ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు శుభవార్త

విజయనగరం టౌన్: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను ప్రారంభించామని, ఇది రైల్వే ప్రయాణికులకు శుభవార్తగా ఆ శాఖ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి పి.సావర్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయల్ రాజస్థాన్ టూర్ ప్యాకేజీలో ఆజ్మీర్, బికనీర్, జైపూర్, జైసల్మీర్, జోద్‌పూర్ మౌంట్ అబూ, పుష్కర్, ఉదయ్‌పూర్‌లను ప్యాకేజీలో చేర్చామన్నారు. ఎల్‌టీసీ స్పెషల్ అండమాన్ ఎమరాల్డ్ ప్యాకేజీలో పోర్ట్‌బ్లెయిర్, రాస్ ఐలాండ్, నార్త్‌బే ఐలాండ్, హావ్లాక్, నీల్ ప్రాంతాలను చూపిస్తామన్నారు. ప్రయాణ బీమాతో పాటు అన్ని వసతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నావారు సెల్:92814 95847, 92810 30748 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు భోగాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిశోర్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ విషయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఐదు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయుడు



చిత్రంలో ప్రార్థన చేస్తున్నది వంగర మండలంలోని మెట్టమగ్గూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ పనిచేసిన హెచ్ఎం అలజంగి సుదర్శనరావు కొన్ని నెలల కిందట హఠాన్మరణం చెందారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుడు జగన్‌మోహన్‌రావు ఒక్కరే తరగతులు కొనసాగిస్తున్నారు. ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు కావడంతో పాఠ్యాంశ బోధన సరిగా సాగడం లేదు. ఆయన ఉపాధ్యాయ సమావేశాలకు వెళ్లినప్పుడు పాఠశాలలో టీచరే ఉండని పరిస్థితి. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మరో ఉపాధ్యాయుడిని నియమించి బోధన సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. - వంగర



విజయనగరం బాలాజీ కూడలిలో వలంటీర్ల మానవహారం



అంబేడ్కర్ జంక్షన్ వద్ద వలంటీర్లు, ఏఐటీయూసీ నాయకుల నిరసన ప్రదర్శన



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న వలంటీర్లు

వలంటీర్ల నిరసన గళం

అధికారంలోకి వస్తే వలంటీర్ల సేవలు కొనసాగిస్తామన్నారు.. నెలకు రూ.10వేలు వేతనం చెల్లిస్తామని చెప్పారు... మీ మాటలు విని ఓట్లు వేశాం.. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల సేవలు పునరుద్ధరించకుండా.. ఉపాధిలేకుండా చేశారు.. కనీసం ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనైనా తమ సేవలను పునరుద్ధరిస్తూ ప్రకటన చేయాలని టీడీపీ కూటమి నేతలను వలంటీర్లు డిమాండ్ చేశారు. విజయనగరంలోని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి (బాలాజీ జంక్షన్) వద్ద గురువారం ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. అక్కడ ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ గోడును వినిపిస్తూ వినతిపత్రం అందజేశారు. మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో వలంటీర్లు సహకారం ఉందని, తక్షణమే వలంటీర్లను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఉద్యోగం, ఉపాధి రాజ్యాంగంలో కల్పించబడిన హక్కుని, వాటిని కాలరాయొద్దన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వలంటీర్లకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రవీంద్ర, పెద్ద సంఖ్యలో వార్డు, గ్రామ సచివాలయాల వలంటీర్లు పాల్గొన్నారు. - విజయనగరం పూల్‌బాగ్

తిరుగులేని మెజార్టీ తథ్యం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీదే విజయం
- పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో సమష్టి కృషి
- 80 శాతానికి పైగా 'స్థానిక' ఓట్లు వైఎస్సార్‌సీపీ సొంతం
- మీడియాతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శంబంగి, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

శాసనమండలిలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానాన్ని 2021లో పోటీ లేకుండా కైవసం చేసుకున్నట్లే ఈ సారి ఉప ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతమవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ధీమా వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నిలిచారు. జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కొప్పులవెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తన సోదరుడు శంబంగి వేణుగోపాల్‌నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు (పులిరాజు), పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావుతో పాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో కలిసి శంబంగి గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు అందజేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించినందుకు పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రతిపాదించిన శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీనులకు, ఏకాభిప్రాయంతో ఆమోదించిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి పార్టీ నాయకులంతా సహకారం అందించాలని కోరారు. అధ్యక్షుడి ఆశయాలకు అనుగుణంగా పార్టీకి, ప్రజలకు సేవలందిస్తానని చెప్పారు.

80 శాతం వైఎస్సార్‌సీపీ బలం...

ఈ ఎన్నికల్లో ఓటుహక్కు ఉండే జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 753 మంది ఉన్నారని, గత 2021 ఎన్నికల నాటికే అందులో 80 శాతానికిపైగా వైఎస్సార్‌సీపీ బలం ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరణాలు తదితర కారణాల వల్ల ఏర్పడిన ఖాళీలు పోను మిగిలిన 727 మంది ఓటర్లలో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పార్టీ నాయకులు, క్యాడర్ శతశాతం సమష్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 11వ తేదీన శంబంగి మరో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని చెప్పారు.

గ్రామస్థాయి నుంచి శంబంగి రాజకీయ ప్రస్థానం

శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తన రాజకీయ ప్రస్థానాన్ని స్వగ్రామమైన బొబ్బిలి మండలం పక్కి నుంచే ప్రారంభించారు. పాల సేకరణ సంఘ అధ్యక్షుడిగా (1976–1984) తొలుత పనిచేస్తూనే 1981లో గ్రామ సర్పంచ్ అయ్యారు. తర్వాత టీడీపీ అభ్యర్థిగా 1983 శాసనసభ ఎన్నికల్లో గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తర్వాత విశాఖ డెయిరీ చైర్మన్ (1984)గా వ్యవహరించారు. మళ్లీ 1985లో రెండోసారి బొబ్బిలి ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఐదు దఫాలు పనిచేశారు. రైల్వే జోన్ యూజర్స్ కమిటీ మెంబర్ (1988), నిజాం సుగర్స్ డైరక్టర్ (1987–1989)గానూ కార్మిక సంఘాల అభ్యున్నతికి కృషి చేశారు. 1994లో మూడోసారి బొబ్బిలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి బొబ్బిలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024 ఎన్నికల్లో పరాజయం పొందారు.

గోస్తనీ ఘోషపై స్పందించిన రెవెన్యూ యంత్రాంగం

- ఇసుక తరలింపునకు అడ్డుకట్ట
- ట్రాక్టర్లు నదిలోకి వెళ్లకుండా పొక్లెయిన్‌తో ట్రెంచ్ తవ్వకం
- బ్రిడ్జికి 500 మీటర్ల వరకూ తవ్వకాలొద్దంటూ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్...

శృంగవరపుకోట: గోస్తనీ నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలపై 'గోస్తనీ ఘోష' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన ఫొటో కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇసుకఅక్రమ తవ్వకాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ అరుణకుమారి ఆదేశాల మేరకు ఆర్ఐ మనోజ్‌కుమార్ వీఆర్వోలను తీసుకుని గోస్తనీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. వేములాపల్లి నుంచి గోస్తనీ నదిలోకి వాహనాలు, నాటుబళ్లు వెళ్లేందుకు అవకాశం లేకుండా పొక్లెయిన్‌తో ట్రెంచ్ కటింగ్ చేయించారు. నదిలో ఉన్న వంతెన నుంచి 500 మీటర్ల పరిధి వరకు మార్కింగ్ చేయించారు. మార్కింగ్‌కు ఆవల ఇసుక తవ్వకాలకు అనుమతిస్తామని, మార్కింగ్ దాటి 500 మీటర్ల పరిధిలోకి వచ్చి ఇసుక తీస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 500 మీటర్ల పరిధిని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆర్ఐ మనోజ్‌కుమార్ చెప్పారు. వంతెనలు, ఊటబావుల సమీపంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగిస్తూ, నదీగర్భం రూపురేఖలే మార్చుతున్నా మైనింగ్ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



గోస్తనీ నదిలోకి వాహనాలు వెళ్లకుండా పొక్లెయిన్‌తో ట్రెంచ్ కట్ చేయిస్తున్న ఆర్ఐ మనోజ్, తదితరులు

విజయసాయిరెడ్డికి అభినందనలు



వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల నూతన సమన్వయకర్త, ఎంపీ వి.విజయసాయిరెడ్డికి మహిళానేతలు అభినందనలు తెలిపారు. విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారిలో జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉన్నారు. - సాక్షి ప్రతినిధి, విజయనగరం

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలికను మంగలివీధికి చెందిన 26 ఏళ్ల కుమిలి సురేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసి తరచూ ఆమె ఇంటికి వెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు 2021లో బాలిక తల్లిదండ్రులు దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేటీఆర్ లక్ష్మి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ కేసును దిశ మహిళా పీఎస్ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్ట్ చేసి, కోర్టులో అభియోగ పత్ర దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ ఇ.నరసింహమూర్తి చర్యలు చేపట్టగా నిందితుడు సురేష్‌పై నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించారు.

గురజాడ వ్యాసరచన పోటీల విజేతలు వీరే..

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని గత నెల 28న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను సమాఖ్య ప్రతినిధి భోగరాజు సూర్యలక్ష్మి గురువారం విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో (8,9,10 తరగతులు) టి.జస్వంత్ (జెడ్పీ ఉన్నతపాఠశాల, గరివిడి), కె.మోదిని (గురజాడ పాఠశాల), ఎం.హాసిని (సోంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కాళ్ల మహేంద్ర (జరజాపుపేట జెడ్పీ హైస్కూల్), డి.ప్రణతి (సెయింట్ మేరీస్ స్కూల్), ఎం.డి.ఇషాసని (ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్)లు కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో (6, 7 తరగతులు) డి.కావ్యశ్రీ (ది సన్‌స్కూల్), వై.తేజస్విని (గురజాడ స్కూల్), కె.బాంధవి(మదనాపురం ఏపీ మోడల్ స్కూల్) వరుస మూడు బహుమతులు గెలుచుకున్నారు. బి.సాయిభవేష్ (ఫోర్ట్ సిటీ స్కూల్), కె.తనూజ (గురజాడ స్కూల్), గెద్దపు మాలతి (జెడ్పీ హైస్కూల్, గరివిడి) కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. విజేతలకు నవంబర్ 30న నిర్వహించే గురజాడ పురస్కార మహోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వ్యాసరచన పోటీల న్యాయనిర్ణేతలుగా డాక్టర్ ఎ.గోపాలరావు, కాకరపర్తి మురళీప్రసాద్ వ్యవహరించారని, గురజాడ ఇందిర, ఈపు విజయకుమార్, బీహెచ్.సూర్యలక్ష్మి, సన్యాసిరావు, రాజేంద్రప్రసాద్, ఈశ్వరరావుల నిర్వహణలో పోటీలు నిర్వహించామన్నారు.

ముందస్తు కేన్సర్ నిర్ధారణ పరీక్షలతో మేలు

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రాణి

విజయనగరం ఫోర్ట్: ముందస్తుగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం మంచిదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన కేన్సర్ అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాల వయస్సు పైబడిన సుమారు 14 లక్షల మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని చెప్పారు. కేన్సర్ లక్షణాలు గుర్తిస్తే మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రులకు రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుబ్రమణ్యం, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యుడు సంబంగి అప్పలనాయుడు, డెమో చిన్నతల్లి, డీపీహెచ్ఎన్ఓ ఎం.సత్యవతి, ఎపిడిమాలజిస్టు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రాణి

అపార్‌ను వేగవంతం చేయండి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- అధికారులతో వీసీలో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈవోలు, హెడ్‌మాస్టర్లతో గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపార్ జారీ ప్రక్రియపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈఓలు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్లే అపార్ ఆలస్యమవుతోందని కొంతమంది తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి పాఠశాల హెచ్ఎం పాఠశాలలో బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థుల జాబితాలను శుక్రవారానికి సిద్ధం చేసి, వారిచేత వెంటనే సచివాలయాల్లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బర్త్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ మంగళవారానికి పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలకు కూడా తగిన ఆదేశాలను జారీ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని, రుచికరంగా ఉండేలా చూడాలని హెచ్ఎంలకు సూచించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో పాఠశాలలను తనిఖీ చేయించి, వెంటనే నివేదికలను పంపించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో యు.మాణిక్యం నాయుడు, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డీపీఓ టి. వెంకటేశ్వరరావు, నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఐహెచ్‌సీఎల్ బృందం ప్రతినిధులను సత్కరిస్తున్న కలెక్టర్

టూరిజం హోటల్స్ ఏర్పాటుపై పరిశీలన

జిల్లాలో ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు టాటా సంస్థకు చెందిన ఐహెచ్‌సీఎల్ ఆసక్తి కనబరుస్తోంది. ఈ సంస్థ ప్రతినిధుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి పలు ప్రాంతాల్లో పర్యాటక హోటల్స్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసింది. జిల్లా అధికారులతో మాట్లాడి హోటల్స్ ఏర్పాటుకు గల అవకాశాలను తెలుసుకుంది. ఐహెచ్‌సీఎల్ గ్రూప్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ రానడే నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి, పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించింది. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌తో కలిసి బృందం సభ్యులు తొలుత భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటు చేయనున్న ఏరోసిటీని సందర్శించి ఆ ప్రాంతంలో పర్యాటక హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలెక్టరేట్‌లో కలిసి జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. భోగాపురం ఎయిర్ పోర్టుతో పాటు జిల్లా కేంద్రంలోనూ, తాటిపూడి రిజర్వాయర్ వంటి ప్రదేశాల్లోనూ హోటల్స్ రిసార్టులు ఏర్పాటు చేస్తే పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో హోటల్స్ రిసార్టులు ఏర్పాటు కోసం ముందుకు వస్తే అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రోత్సహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఏపీఈడీబీ ప్రతినిధి రామేశ్వర్ ఏపీటీఏ ప్రతినిధి రాంప్రసాద్ ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఎన్‌టీయూ జీవీని సందర్శించిన ఎస్పీ



ఎస్పీని సత్కరిస్తున్న యూనివర్సిటీ ఇంచార్జ్ విసి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ (గురజాడ విజయనగరం) లో 'సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్' అనే అంశంపై పోలీస్ శాఖ నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం సందర్శించారు. పర్యవేక్షణలో భాగంగా ఆయన యూనివర్సిటీ ప్రాంగణాన్ని పరిశీలించారు. తొలుత యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను యూనివర్సిటీలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. జి. జె.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్‌డీడీవీ శివరాం, డాక్టర్. టీఎస్ఎన్ మూర్తి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైటీసీలో గురువారం జరిగిన జాబ్‌మేళాకు ఆయన హాజరై అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు. ఒక సారి ఉద్యోగంలో చేరాక మధ్యలో మానివేయకుండా కష్టపడి పనిచేయాలని హితవు పలికారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సహకారంతో ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సులో విశాఖపట్నంలో 3 నెలల శిక్షణ ఉంటుందన్నారు. మొత్తం 45 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన గురుకుల విద్యార్థి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి రాఘవేంద్ర

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామం వద్దనున్న మహాత్మ జ్యోతి బాపులే గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి వంగపండు రాఘవేంద్ర రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈనెల 6,7,8 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా కైకలూరులో జరిగిన అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో 160 సెంటీమీటర్ల హైజంప్ చేసి గోల్డ్‌మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. పురుషోత్తం గురువారం తెలిపారు. దీంతో జార్ఖండ్‌లో డిసెంబర్ 2 నుంచి జరగబోయే జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాఘవేంద్ర పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల పీడీ చొక్కాపు అప్పలనాయుడు, టీచర్స్, సిబ్బంది అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలంటూ ప్రోత్సహించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అక్కాచెల్లెళ్లు



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు ధనుశ్రీ, దీక్ష శ్రీ

విజయనగరం: జిల్లాలోని డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు అట్టాడ ధనుశ్రీ, దీక్ష శ్రీలు తైక్వాండోలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. గత నెల 4,5 తేదీలలో ఆంధ్రప్రదేశ్ 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 19 పోటీలు కడపజిల్లా రైల్వేకోడూరు మండలం జరిగాయి. అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అట్టాడ ధనుశ్రీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 18 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆమె హాజరు కానుంది. అలాగే దీక్షశ్రీ కూడా అక్క బాటలో నడుస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తోంది. గత నెల 6, 7 తేదీలలో తిరుపతిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదీశ జిల్లాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లకు పలువురు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలంటూ ప్రోత్సహించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

అపర సంజీవిని ఆపసోపాలు..!

- ప్రశ్నార్థకంగా 108 అంబులెన్సుల నిర్వహణ
- సిబ్బందికి 3నెలలుగా అందని జీతాలు
- నిర్వహణపై శ్రద్ధ చూపని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 108 అంబులెన్సులు 28
- 104 వాహనాలు 46



విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని 108 అంబులెన్సులు రోగులకు సేవలందించేందుకు ప్రభుత్వం నిర్వాకంతో ఆపసోపాలు పడుతున్నాయి. అంబులెన్సుల నిర్వహణ ఈ ప్రభుత్వం హయాంలో ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న 108 అంబులెన్సుల పట్ల కూటమి సర్కార్ నిర్దయతో వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 108 అంబెలెన్సుల నిర్వహణకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో 108 అంబులెన్సులకు డీజిల్ వేయించడానికి నిర్వహణ సంస్థ ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. 108 నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడం వల్ల సిబ్బందికి జీతాలు కూడా సక్రమంగా అందని పరిస్థితి. గడిచిన మూడు నెలలుగా వారికి జీతాలు అందకపోవడం వల్ల కొద్ది రోజులుగా సిబ్బంది నల్లబాడ్జీలతో నిరసన తెలియజేస్తున్నారు. 108 అంబులెన్సుల సిబ్బందితో పాటు, 104 సిబ్బంది, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి కూడా జీతాలు అందని పరిస్థితి. వీటి నిర్వహణ కూడా ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

108 ద్వారా ఎంతో మందికి సేవలు

ఆపద సమయంలో ప్రాణాలు నిలిపే ప్రాణదాతగా108 అంబులెన్సుకు గుర్తింపు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు, పురిటినొప్పులు వచ్చే సమయంలో ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, ఊపిరాడక ఇబ్బంది పడే రోగులు, పాము కాటుకు గురైన వారు, గుండె పోటు, పక్షవాతం, తీవ్రమైన కడుపు నొప్పి ఇలా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని సకాలంలో 108 అంబులెన్సులు ఆస్పత్రికి చేర్చుతున్నాయి.

2020 నుంచి 2023 వరకు అందించినసేవలు వివరాలు:

సంవత్సరం	సేవలు పొందిన రోగులు
2020	24,868
2021	56,536
2022	55,556
2023	80,500

జిల్లాలో 28 వాహనాలు

జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వాటిలో రెండు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు వాహనాలు. ఒకటి నవజాత శిశువులకు సేవలు అందించే నియోనేటల్ అంబులెన్సు. 25 లైఫ్ సపోర్టు అంబులెన్సులు. ఉన్నాయి. వాటికి ప్రతిరోజూ డీజిల్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. అదేవిధంగా జిల్లాలో 104 వాహనాలు 46 ఉన్నాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 22 ఉన్నాయి. వాటికి డీజిల్ నిమిత్తం రోజుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది.

గత ప్రభుత్వంలో 2.17 లక్షల మందికి సేవలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాలో 2020లో ఆధునాతన 108అంబులెన్సులు ప్రారంభించారు. 2020 నుంచి 2023 వరకు 2,17,460 మందికి ఈ అంబులెన్సులు సేవలు అందించాయి. ఏడాదికి 50 వేల నుంచి 80 వేల మంది వరకు సేవలు పొందారు.

డీజిల్‌కు ఇబ్బంది పడుతున్న పరిస్థితి

108 అంబులెన్సులకు డీజిల్‌కు డబ్బులు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బంక్ యాజమానులతో మాట్లాడి అంబులెన్సులకు బడ్జెట్ వచ్చినప్పుడు చెల్లిస్తామని డీజిల్ వేయిస్తున్నారు. 108 అంబులెన్సులలో 142 మంది, 104 వాహనాలల్లో 103 మంది పైలెట్లు, ఈఎంటీలు,డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్, జిల్లా మేనేజర్లు పనిచేస్తున్నారు.

జీతాలు అందడం లేదు

108 అంబులెన్సు, 104 సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందని మాట వాస్తవమే. బడ్జెట్ వస్తే డీజిల్ డబ్బులు ఇస్తామని బంక్ యాజమానులకు చెప్పి అంబులెన్సులకు డీజిల్ పోయిస్తున్నాం.
నజీర్ హుస్సేన్, 108,104 జోనల్ మేనేజర్

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటు

- జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన



జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని పార్వతీపురం మన్యం జిల్లా అటవీ శాఖాధికారి జీఏపీ ప్రసూన వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంటనష్టం, మానవ ప్రాణనష్టం, గాయాలు, పశువుల మరణాల అవకాశాలను తగ్గించడం ద్వారా నిర్దిష్ట ప్రాంతంలో ఏనుగులను నిలువరించడం ఈ కేంద్రం లక్ష్యమని ఆమె తెలిపారు. 2018 నుంచి ఇప్పటివరకు ఏనుగుల దాడుల వల్ల దాదాపు రూ.13 కోట్లు పంటనష్టం జిల్లాలో జరిగినట్లు అంచనా వేశామని పేర్కొన్నారు. ఆహారం, నీరు, నివాసం కోసం ప్రయాణించే ఏనుగుల కదలికలను అంచనా వేయడం కష్టతరమన్నారు. మానవులు, వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చురుగ్గా పని చేస్తోందని, పెదబొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అవాంఛనీయ సంఘటన దృష్ట్యా, ప్రస్తుతం ఏనుగులు ఉన్నచోట పెద్ద సంఖ్యలో జనం గుమిగూడినందున ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని తెలియజేశామన్నారు. అటవీ శాఖ ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించామని, వాటి భద్రతను నిర్ధారించడానికి స్థానిక గ్రామస్తులను వెంటనే అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. ఏనుగుల కార్యకలాపాల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు, బాధిత రైతుల నుంచి దరఖాస్తులను సేకరించి, అవసరమైన పరిహారం క్లెయిమ్‌లు అందేలా చూసేందుకు అటవీ శాఖ పూర్తి బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు.



వెంకంపేట నుంచి వెళ్తున్న ఏనుగులు

ఏనుగులను తరలించేందుకు స్పెషల్ డ్రైవ్

జనావాసాల నుంచి ఏనుగులను తరలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని వెంకంపేట నుంచి గురువారం ఈ డ్రైవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుగుల వల్ల జరిగే ఆస్తి, ప్రాణనష్టాలను నివారించేందుకు తరలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాకర్లు అటవీ శాఖ సిబ్బందితో కలిసి ఏనుగులను తరలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఏనుగులను అడ్డూరు వలస గ్రామం వరకు తరలించామన్నారు.

వ్యాన్ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఓ వ్యాన్ బోల్తా పడింది. చేపలలోడుతో విశాఖపట్నం నుంచి ఒడిశా వెళ్తుండగా వ్యాన్ డ్రైవర్ బాపీ సడన్ బ్రేక్ వేయడంతో ముందు టైర్ పంక్చర్ అయి బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయ ట పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు.

యువత సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయవద్దు

- డీవైఎఫ్ఐ విజ్ఞప్తి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో పదవీ విరమణ చేసిన సిబ్బందిని మళ్లీ నియమించాలని భారతీయ రైల్వే ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయనగరం రైల్వే స్టేషన్‌మాస్టర్. మాస్టర్ మురళికి డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ సీహెచ్. హరీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఈ విధానం యువత సామర్థ్యాన్ని బలహీనపరిచే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే దేశంలో ఇప్పటికే నిరుద్యోగం తారాస్థాయిలో పెరుగుతున్న తరుణంలో రైల్వే శాఖలో 2.98 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, అర్హత కలిగిన నిరుద్యోగులను పక్కన పెట్టి కాంట్రాక్ట్ ప్రాతిపదికన రిటైర్డ్ ఎంప్లాయీస్‌ను తీసుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని మోడీ అందుకు భిన్నంగా యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమంటూ ఖండించారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు దుర్గాప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థి తండ్రికి చెక్కు అందజేత

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలంలోని రావాడ-రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిమ్మక సంజీవరావు బుధవారం మృతిచెందిన నేపథ్యంలో మృతుని తండ్రి కృష్ణారావుకు తక్షణ ఆర్థిక సాయంగా లక్షరూపాయల చెక్కును ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ గురువారం అందజేశారు. ఆరోగ్యంగా ఉన్న సంజీవ్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కావాలని పాఠశాల సిబ్బంది ఫోన్ చేయగా తండ్రి కృష్ణారావు తీసుకు వెళ్తుండగా కురుపాం వెళ్లేసరికి కుమారుడు సంజీవ్‌కుమార్ ఆరోగ్యం బాగులేదని సమాచారం వచ్చింది. అరువాత ఆశ్రమ పాఠశాల సిబ్బంది తమ కుమారుడి మృతదేహాన్ని ఆటోలో మా గ్రామానికి పంపించారని, ఆరోగ్యంగా ఉన్న కుమారుడు ఒక్కసారిగా ఎలా చనిపోయాడో అర్థం కావడం లేదని, దీనిపై దర్యాప్తు నిర్వహించి ఆదుకోవాలని మృతుడి తండ్రి కోరాడు. కృష్ణారావు భార్య రెండేళ్ల క్రితమే భార్య చనిపోయింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కూడా చనిపోయాడు. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి మృతి



మృతుడు రాంబాబు (ఫైల్)

మెరకముడిదాం: బైక్‌ను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెరకముడిదాం మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన తాడ్డి రాంబాబు (40) గురువారం బైక్‌పై గర్భాం వైపు వెళ్తుండగా... గర్భాం-భైరిపురం ప్రధాన రోడ్డుపై గర్భాం నుంచి భైరిపురం వస్తున్న టాటా ఏసీ లగేజీ వ్యాన్ ఢీకొంది. రాంబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే విజయగనగరం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేక పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఉమతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి యజమాని మృతితో భార్య పిల్లలు భోరున విలపిస్తున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధరాయవలస ఎస్ఐ జి.లోకేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

లారీని ఢీకొని పెయింటర్ దుర్మరణం



మృతుడు వంక భాస్కర్

తగరపువలస: ద్విచక్రవాహనంతో ఆగి ఉన్న గ్యాస్ సిలిండర్ల లారీని ఢీకొని పెయింటర్ మృతి చెందాడు. ఈ ఘటన ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ సీహెచ్ వాసునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం బీసీ కాలనీకి చెందిన వంక భాస్కర్ ఆనందపురం మండలం చందకలో పెయింటింగ్ పనులకు వచ్చి గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో తిరుగుపయనమయ్యాడు. పెద్దిపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో సంఘటనా స్థలంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ జి.సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీసీసీ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

- బూడిదైన నరమామిడి చెక్కల బస్తాలు



మొండెంఖల్లు గొడౌన్‌లో కాలిపోతున్న నరమామిడి చెక్కల బస్తాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలోని జీసీసీ అటవీఫలసాయాల కొనుగోలు కేంద్రం (ఎంఎఫ్‌పీ)లో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గొడౌన్‌లో నిల్వ ఉంచిన నరమామిడి చెక్కల బస్తాలు దగ్ధమయ్యాయి. గొడౌన్ లోపలి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు తలుపులు తెరిపించి చూసేలోగా నరమామిడి చెక్కల బస్తాలు అగ్నికి ఆహుతుండడం గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అయినప్పటికీ కొంతమేర బస్తాలు కాలిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ హుటాహుటిన మొండెంఖల్లు చేరుకుని గొడౌన్‌ను పరిశీలించి, జరిగిన నష్టం, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గొడౌన్ వద్ద 2,400 నరమామిడి చెక్కల బస్తాలు నిల్వ ఉండేవని, జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షలు విలువ చేసే నరమామిడి చెక్కలు కాలిబూడిదయ్యాయని డీఎం తెలిపారు. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- ఘనంగా 75వ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్



రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సోమేశ్వరరావు (కుడివైపు చివరన కళ్లద్దాలు పెట్టుకున్న విద్యార్థి)

విజయనగరం అర్బన్: గొప్ప సేవా దృక్పథంతో, జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని కలెక్టర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 ఆవిర్భావ దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, విశేష ప్రతిభ చూపిన 10 మంది స్కౌట్స్, గైడ్స్‌కు రాజ్యపురస్కార్ సర్టిఫికెట్లను బహూకరించి, వారిని అభినందించారు. స్కౌట్స్ ప్రదర్శించిన విన్యాసాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ సేవలను ప్రశంసించారు. సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న ఈ సంస్థకు అత్యంత ప్రాముఖ్యం ఉందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులను ఈ ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు. దశలవారీగా ప్రైవేట్ పాఠశాలలకు కూడా విస్తరిస్తామని ప్రకటించారు. జిల్లాలో స్కౌట్స్, గైడ్స్ సేవలను విస్తరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ చెప్పారు.

ప్రతి పౌరుడిపై దేశ బాధ్యత

జిల్లా విద్యాశాఖాధికారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందన్నారు. మాతృభూమిని సంరక్షించడంతోపాటు, గౌరవించాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరునిపైనా ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ బాధ్యతను స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రేరేపిస్తుందని చెప్పారు. మంచి పౌరులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడే ఈ కార్యక్రమం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.చిన్నంనాయుడు మాట్లాడుతూ ఈ ఉద్యమ చరిత్రను వివరించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు జిల్లాలో బాగా జరుగుతున్నాయని, కొత్తవలస జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి ఆర్‌డీ సోమేశ్వరరావు రాజ్యపురస్కార్‌కు ఎంపికై, గవర్నర్ చేతులమీదుగా అందుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో డీసీ బోర్డు కార్యదర్శి సన్యాశిరాజు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, గైడ్స్ కమిషనర్ సౌభాగ్యలక్ష్మి, ఇతర ప్రతినిధులు, హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులు

వి.రాధాకృష్ణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్కిడాం), పల్లి గుణవర్ధన్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జొన్నవలస), వీవీ జ్ఞానేశ్వర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జొన్నవలస), కోట్ల వాసుదేవ్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెల్లివలస), నంద బెనర్జీ బాబు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తవలస), రెడ్డి మిధున్ చక్రవర్తి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొయిద), అవినాష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎల్ కోట), బండి ఇమ్మానుయేల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగుపూడి), నేతల జాన్ బెర్నాఛ్ (సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, విజయనగరం), పాతర్లపల్లి చరణ్ (శ్రీ ఆదిత్య పబ్లిక్ స్కూల్, నెల్లిమర్ల).

పట్టు బిగిస్తున్న ఉత్తరాఖండ్

- మొదటి ఇన్నింగ్స్‌లో 338 పరుగులు
- ఆంధ్ర 92/4



ఆంధ్రా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



బౌలింగ్ చేస్తున్న ఆంధ్రా ఆటగాడు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్- ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టు పట్టు బిగిస్తోంది. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో ఉత్తరాఖండ్ క్రీడాకారులు రాణిస్తున్నారు. 87 ఓవర్లలో వికెట్‌నష్టపోయి 223 పరుగులు ఓవర్‌నైట్ స్కోరు వద్ద రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు ఎక్కువ సమయం మైదానంలో నిలదొక్కుకోలేకపోయింది. మొత్తం 135.2ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటొంది. జట్టులో పీఎస్ కుందూరి 112 పరుగులు, సమర్థ్ 59 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో ఆంధ్ర క్రీడాకారులు లలిత్‌మోహన్ 4 వికెట్లు, కేవీ.శశికాంత్ 2 వికెట్లు, పీవీఎస్ఎన్ రాజు2 వికెట్లు, త్రిపురణ విజయ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మెన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 35.4ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 92 పరుగులు చేశారు. జట్టు బ్యాటింగ్‌లో అభిషేక్‌రెడ్డి 35 పరుగులు, హేమంత్ రెడ్డి 18 పరుగులు, కరణ్ షిండే 19 పరుగులు, విహారి 15 పరుగులు (నాటౌట్‌గా) పరుగులు జోడించారు. టెస్ట్ మ్యాచ్ తరహాలో 4 రోజుల పాటు జరిగే మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలి ఉంది.

సినీ ఫక్కీలో చోరీ

- నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతో పరారీ



చికిత్స పొందుతున్న గంగమ్మ

గరుగుబిల్లి: ఓ వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకుని సినీఫక్కీలో చోరీకి పాల్పడిన సంఘటన గురువారం గరుగుబిల్లి మండలంలోని దళాయివలసలో జరిగింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంట గంగమ్మ పార్వతీపురం వెళ్లేందుకు గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వేచి ఉన్న సమయంలో అటుగా పల్సర్ బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఎర్రన్న గుడి వరకు దింపుతానని చెప్పి వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఉల్లిభద్రకు వెళ్లే ముందు ఉన్న మట్టి రోడ్డు వైపు బైక్ తిప్పడంతో ఇటు ఎందుకు వెళ్తున్నావని గంగమ్మ ప్రశ్నించగా ఏమీ చెప్పకుండా బైక్‌ను నడిపాడు. దీంతో వెనుకన కూర్చున్న గంగమ్మకు ఏం చేయాలో తోచక బైక్‌పై నుంచి దూకేయడంతో కింద పడి స్పృహ కోల్పోవడంతో ఆమె మెడలో ఉన్న రెండు తులాల గొలుసు, రెండుపేట్ల పుస్తుల తాడు తీసుకుని ఆ నిందితుడు పరారయ్యాడు. స్పృహ వచ్చిన తరువాత గంగమ్మ ఈ విషయాన్ని బంధువులకు తెలియజేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు ఆమెను చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రమేష్ నాయుడు తెలిపారు.